
# పేడియా మావయ్య పొదుపు పథకం

తోలేటి జగన్మోహనరావు



"ఏమిట్రా! చూద్దాం అంటున్నాడు మీ నాన్న" అన్నాడు పేడియా మావయ్య లోపలికి వస్తూ.

పేడియా మావయ్య అంటే వాకింగ్ ఎన్సైక్లోపేడియా అన్న మాట. అలా అని మా చిన్న మావయ్య పిలుస్తాడు. పేడియా మావయ్య- మా పెద్ద మావయ్య. ఎకనమిక్సు లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. మా పెద్ద మావయ్యకి ప్రపంచంలో తెలియని విషయంలేదు. అకాలీ ఆందోళన మొదలు అంతరిక్ష ప్రయాణాల దాకా ఏ విషయం గురించైనా అనర్గళంగా మాట్లాడగలడు.

"వీడికి కాలేజీలో చేరేప్పటికి సైకిలు కావాలిట. అప్పుడు డబ్బు లేదు. చూద్దాం అంటున్నాను" అన్నారు నాన్న.

ఈ ఏడాదితో నా స్కూలు చదువు పూర్తయిపోతుంది. కాలేజీ మా ఇంటికి చాలా దూరంగా ఉంది.

"డబ్బు ఉండడమనేది ఎప్పుడూ ఉండదు బావా! సరిగా మానేజ్ చేసుకోపోతే బిర్లాగారి జేబులో కూడా పావలా ఉండదు. అంతా మనం చేసుకోడంలో ఉంది" అన్నాడు పెద్ద మావయ్య, డబ్బు లేకపోవడానికి మా అజాగ్రత్త కారణ మన్నట్టు.

"పోనీ నువ్వు మా వ్యవహారాలు కొంత కాలంపాటు నడిపించి చూడకూడదూ! మా వల్ల కావటంలేదు" అన్నారు నాన్న నవ్వుతూ.

"నే చెప్పిన మాట మీరందరూ వింటే వీడికి సైకిలేకాదు, ఒరే మురళీ, నీకు ఓ టి. వి. ని కూడా కొనిస్తాను" అన్నాడు పెద్ద మావయ్య నాకు సైకిలు కొంటానంటే మొహం మాడ్చుకు కూర్చున్న మా పెద్ద తమ్ముడితో.

టి. వి. అనగానే వాడి మొహం చేటంతయింది. మా ఊళ్లో ప్రస్తుతం టి. వి. రాకపోయినారిలే స్టేషను దగ్గరలో పెడితే మాకు టి. వి. వస్తుంది. ఆ రిలే స్టేషను పెట్టేప్పటికి మా టి వి. ఇంట్లో సిద్ధంగా ఉంటుంది.

"ఏమిట్రా మీ మావయ్య టి. వి. కొనిపెడతానంటున్నాడు" అంటూ వంటింట్లోకి వచ్చింది అమ్మ చేతులూదుకుంటూ.

అమ్మ కొంగు పట్టుకుని మూడేళ్ళ మా చిన్న తమ్ముడు లాగు పైకి లాక్కుంటూ, బిస్కట్లు తింటూ వచ్చాడు.

"నేను కొనిపెట్టనేవ్! ఆ ఆశలేం పెట్టుకోకు. మీ చేత పొదుపు చేయించి కొనిపిస్తాను."

"ఆ చేత్తో నాకు ఓ మిక్సీ కూడా కొనిపెట్టరా! పప్పు రుబ్బలేక ఛస్తున్నాను."

"అదీ కొనిపెడతా నా మాట వింటే"

"వింటాం" అన్నాం అందరం ఏక కంఠంతో.

ఒక నెల రోజులు మా ఖర్చులన్నీ పరిశీలించి పేడియా మావయ్య ఒక పొదుపు పథకం తయారు చేశాడు.

"ఇంట్లో అనవసరమైన ఖర్చులన్నీ తగ్గించెయ్యాలి. అనవసరమైన ఖర్చు లేవో లిష్టు రాశాను. ఇవి తగ్గించేస్తే నెలకు కనీసం వంద రూపాయలు పొదుపు చెయ్యొచ్చు" అని ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించాడు పేడియా మావయ్య. "నాలుగు నెలల్లో వీడికి సైకిలూ, సంవత్సరంలో నీకు మిక్సీ....."

"చెప్పు" అంది అమ్మ ఉత్సాహంగా.

"సినిమాలు మానెయ్యాలి."

"మానేస్తాం."

"పని మనిషిని మాన్పించెయ్యాలి."

"అంట్లు నువ్వు తోముతావా?"

"నువ్వే తోముతావు. రేపు పప్పు రుబ్బడం మానేయడానికి ఇవాళ అంట్లు తోముతావు" అన్నాడు ఆకాశవాణిలా.

"ఈ మాటలు నా దగ్గర అంటే అన్నావు కాని రేపు పెళ్ళయ్యాక మీ ఆవిడ దగ్గరనకు. ఒక్క తాపు తంతుంది" అంది కాని ఒప్పేసుకుంది అమ్మ.

"రెండు. నెయ్యి మానెయ్యాలి. నెయ్యికి, నూనెకి ఆహార విలువల్లో పెద్ద తేడా లేనప్పుడు ఎక్కువ ఖరీదు పెట్టి నెయ్యి ఎందుకు కొనాలి?"

"పాపం చంటి వెధవలకైనా పప్పులోకి నెయ్యి వేద్దాం రా"

"వీల్లేదు. అసలు ఈ చంటి వెధవ నెలకు పది రూపాయల బిస్కట్లు, టాఫీలు తినేస్తున్నాడు. వెధవ బిస్కట్లు ఆరోగ్యానికి మంచిదికాదు. వీడికి పాలల్లోకి బోర్నవిటా అనవసరం. పాలే బలం కాని బోర్నవిటా కాదు. అంచేత బిస్కట్లు, బోర్నవిటా కట్"

"చంటి వెధవ వట్టి పాలు తాగడురా అది లేకపోతే" అంది అమ్మ. వాడి నెత్తుకుని ముద్దాడుతూ.

తగలబోతున్న దెబ్బ చంటాడికి అర్థం కాలేదు. అంచేత అమ్మని గట్టిగా కౌగలించుకుని ఓ ముద్దు ఇచ్చి, చేతిలో ఉన్న బిస్కట్టు ముక్క అమ్మ నోట్లో పెట్టాడు, అందరూ నవ్వుతుంటే వాడూ నవ్వుతూ.

మేం అంతా ఏకగ్రీవంగా పొదపు పథకం ఆమోదించాలి. అమ్మ మాత్రం మౌనంగా ఓటు వేసింది.

చంటాడికి ఓటు హక్కు లేదు కదా!

నాలుగు రోజులు తర్వాత బోర్న్‌విటా అయిపోయాక అమ్మ చంటాడికి గ్లాసులో పాలుపోసి ఇచ్చింది.

వాడు పాల గ్లాసు కేసి చూశాడు. అమ్మ బోర్న్‌విటా వేస్తుందేమోనని. అమ్మ ఏం మాట్లాడకుండా తన పని తను చేసుకుంటుంటే వాడు అమ్మ కొంగు పట్టుకులాగి,'అమ్మా! అది' అంటూ బోర్న్‌విటా డబ్బా చూపించాడు.

అమ్మ మూత తీసి ఖాళీ డబ్బా చూపించి, "తాగు" అంది విసుగ్గామొహం పెట్టి.

పేడియా మావయ్య పొదుపు పథకం అర్థం కాకపోయినా దాని దెబ్బ మాత్రం అర్థమయింది చంటాడికి. బోర్న్‌విటా లేకపోవడానికి, అందరూ ఆ రోజు మాట్లాడుకున్న దానికి సంబంధం ఉందని కూడా వాడికి అర్థమైంది.

వెంటనే ధాంమని నేలమీద పడిపోయి అరు న్నొక్క రాగం అందుకున్నాడు.

అమ్మ వాడిని ఎత్తుకోబోతుంటే, పెద్ద మావయ్య కళ్ళతోనే వారించి, వాడిని రెక్క పట్టుకుని గదిలోకి ఈడ్చుకొచ్చి, "తాగుతావా! తన్నమంటావా!" అన్నాడు గ్లాసు అందించి.

"తాగను" అన్నాడు చంటాడు ఏడుస్తూ.

"నువ్వు తాగకపోతే నే తాగేస్తా."

చంటాడికి ఉదుకుమోత్తనం వచ్చి పాల గ్లాసు విసిరేసి నేలమీద పడి దొర్లడం మొదలు పెట్టాడు ఏడుస్తూ.

"ఏడు గాడిదా!" అన్నాడు పెద్ద మావయ్య కళ్ళెర్రజేసి.

"నువ్వే ఏలు గాలిదా!" అన్నాడు చంటాడు ఏడుస్తోనే.

తప్పు! మావయ్యని అలా అనకూడదమ్మా" అని అమ్మ వాడిని ఊరుకో బెట్టడానికి ప్రయత్నిస్తుండగా చిన్న మావయ్య వచ్చాడు.

అమ్మ చిన్న మావయ్యకు పొదుపు పథకం గురించి చెప్పింది.

"ఏరా బుల్లి నక్సలైటా! డబ్ల్యు. ఇ. పేడియాగారిమీదే తిరగబడుతున్నావ్రా." అని తమ్ముడిని గాలిలోకి ఎగరేసి మళ్ళీ పట్టుకుని కిత కితలు పెట్టాడు.

పెద్ద మావయ్యకి, చిన్న మావయ్యకి ఒక్షణం కూడా పడదు.

అంచేత చిన్న మావయ్య రాగానే, 'నే వెళ్ళొస్తానే,' అని వెళ్ళిపోయాడు పెద్ద మావయ్య.

మా ఇంట్లో మొట్ట మొదట పేడియాగారిమీద తిరుగుబాటు జెండా ఎగరేసింది ఓటు హక్కు లేని మాచిన్న తమ్ముడు.

....మిగిల్చిన వంద రూపాయలు ఒక డబ్బాలో పెట్టి, నేనూ మురళి సమయం దొరికినప్పుడల్లా లెక్క పెడుతూ ఉండే వాళ్ళం. డబ్బులు లెక్క పెడుతుంటే అదో థ్రిల్‌గా ఉండేది. అలా లెక్క పెడుతూ కొత్త సైకిలు తొక్కుతున్నట్టు ఊహించుకుంటూ గాలిలో తేలిపోతూండే వాడిని.

"సినిమా హాల్లో చూసినట్టు పాటలు, సినిమాలు మన ఇంట్లో మంచం మీద పడుకుని చూస్తుంటే బలేగా ఉంటుంది కదరా." మురళి అనేవాడు. "కొన్నాళ్ళు పోయాక ఇది అమ్మేసి రంగుల టి వి. కొనుక్కుందాం రా. అప్పుడు అంతా రంగుల సినిమాయే! గొప్ప మజా వస్తుంది."

మళ్ళీ నెల ఇంకో వంద తీసి డబ్బాలో పడేద్దాం అనుకున్నాం కాని అనుకున్నట్టు రెండు వందలు చెయ్యలేక పోయాం.

పాల ఖర్చు పెరిగింది.

బియ్యం ధర పెరిగింది.

నాన్నగారు ఆఫీసుకి వెళ్ళడానికి బస్సు ఖర్చు పెరిగింది.

ఖర్చు అరవై పెరిగి మా డబ్బాలో నూట నలభై మాత్రమే మిగిలాయి.

పేడియాగారు శిఖరాగ్ర సమావేశం జరిపి మళ్ళా ఎక్కౌంటు పుస్తకాలన్నీ తిరగేసి మరగేసి పొదుపు ఉద్యమాన్ని ఉధృతం చేశారు.

"బావా! నువ్వు పేపరు మానెయ్యి! ఏ లైబ్రరీలో నో చదువు. ఏవేవ్! నువ్వు వార పత్రికలు, మాస పత్రికలూ మానేసెయ్"

"అంట్లు తోమాక అవే కదురా కాలక్షేపం"

"అదేం వీలుపడదు"

కొంత లోటు పూడింది కాని బజారు పనులన్నీ చేసే మా మురళికి మూడు నెలల్లో ఉత్సాహం క్రమ క్రమంగా తగ్గిపోయింది.

నాలుగో నెల బజారునుంచి నెల సరకులన్నీ తీసుకొచ్చి ఇంట్లో పడేసి మిగిలిన డబ్బులు మావయ్యకి ఇచ్చాడు నీరసంగా.

"ఏవిట్రా! ఇంతే ఇచ్చావు! కమిషను కొట్టెయ్యలేదు కదా" అన్నాడు మావయ్య అనుమానంగా.

"ఆగస్టు పదిహేను తందానా
అడుక్కు తినమన్నారు తందానా

నిట్టల బ్రదర్సు వారి పాట లంకించుకున్నాడు. మురళి టేబులుమీద దరువు వేస్తూ.

"ఏవిట్రా నీ గొడవ?"

"నూనె పెరిగింది, పంచదార పెరిగింది, పప్పు పెరిగింది, ఉప్పు పెరిగింది" అని పాటగా పాడి. "ఇటువంటి పరిస్థితులలో పేడియాగారు సైకిలు కొంటే కొంటారేమో కాని టి. వి. ఈ జన్మకు కొనలేరని తన ప్రగాఢ విశ్వాసమని తెలియజేస్తూ తాయారమ్మగారి రెండవ కుమారుడు శ్రీశ్రీ మురళిగారు పేడియాగారి పొదుపు పథకానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నారని" ఉద్ఘాటించాడు మా మురళి.

మురళి తిరుగుబాటు చేసిన తర్వాత పెద్ద మావయ్య కొంచెం అదిరాడు. మళ్ళీ లెక్కలు చూసి జుట్టు పీక్కున్నాడు కాని తగ్గించడానికి అనవసర ఖర్చు ఏవీ కనుపించలేదు.

అయినా ఆ విషయం గురించి తీవ్రంగా ఆలోచించడం మానలేదు.

ఓ రోజు హడావిడిగా ఏదో పుస్తకం తీసుకు వచ్చాడు మావయ్య.

"ఏమేవ్ అక్కా! ఇది విన్నావా?" అన్నాడు అమ్మని పిలుస్తూ.

"వస్తున్నా! చారులో పోపు పెట్టనీ" అంది అమ్మ వంటింట్లోంచి.

"ఏమిట్రా నీ గొడవ" అన్నారు నాన్న నవ్వుతూ.

"మన ఖర్చులో దాదాపు మూడో వంతు తగ్గించెయ్యొచ్చు బావా" అన్నాడు మావయ్య సంతోషంగా.

"ఎలా?" ఆశ్చర్యపోతూ అడిగారు నాన్న.

"ఈ పుస్తకం చూడు బావా! మనం మనకి కావలసిన దానికంటే ఎక్కువే తింటాంట. మనం తినే దాంట్లో మూడో వంతు తగ్గించేసినామన ఆరోగ్యానికి ఏమాత్రం హాని కలుగదన్నమాట. ఉదాహరణకు ఈ గాడిదలు...."

నన్నూ, తమ్ముళ్ళనీ చూపిస్తూ అన్నాడు.

"....మూడు పూటలా మెక్కే బదులు రెండు పూటలే...."

వాక్యం పూర్తి చెయ్యకుండానే 'చచ్చానేవ్' అని కేకేసి తల రుద్దుకోవడం మొదలు పెట్టాడు మావయ్య. అమ్మ విసిరిన పోపు గరిటె పేడియాగారి బుర్ర టంగుమనిపించి ఎగిరి నాన్నగారి కుర్చీ దగ్గర పడింది.

"ఇంక వెధవ పథకాలు చెప్పకు"

అమ్మ, కళ్ళెర్రజేసి హింసాత్మకంగా వాకౌటు చేసింది.

తర్వాత నెల పేడియాగారు నిరుత్సాహంగానే ఎకౌంట్సు తిరగేశారు.

చాలాసేపు ఆలోచించి, వంటింట్లోంచి బూరెల మూకుడు తీసుకొచ్చి హెల్మెట్‌లా నెత్తిమీద పెట్టుకుని గబ గబ మంత్రాలు చదువుతున్నట్టు చదివేశాడు.

"వేరుశనగ నూనె బదులు పామాయిలు వాడాలి. సాయంత్రం కూరలు మానెయ్యాలి. టిఫిన్లు, పిండి వంటలు నిషిద్ధం. కాఫీ మానేయ్యాలి. ఆపైన మీ ఇష్టం" అని వెంటనే బయటకు పారిపోయాడు.

అదీ అమలు జరిపాం.

ఇంకో రెండు నెలలు గడిచాయి.

ఇప్పుడు డబ్బాలో రెండు వందల ఇరవై రూపాయలున్నాయి. ఇదివరకటిలా నేను రోజూ లెక్క పెట్టడంలేదు. మురళి డబ్బా కేసి చూడ్డం లేదు. పేడియా మావయ్యని చూస్తే వాడు పగలబడి నవ్వుతున్నాడు.

మావయ్య ఓ రోజు ఎక్కౌంటు పుస్తకం తిరగేస్తుంటే, మురళి ప్రవేశించి గుమ్మం దగ్గర నిలబడి 'ఆగస్టు పదిహేను తందానా....' అన్నాడు.

"ఏవిట్రా?" అన్నారు పేడియాగారు భయం

తెల్ల వెంట్రుకలు నల్లపర్చును

మేము యెక్కువగా ప్రశంశించదలచలేదు. మా ఆయుర్వేదక తైలము తెల్లవెంట్రుకలను కుదుళ్లనుంచి నల్లబర్చి, తెల్లవెంట్రుకలు రాకుండా అరికట్టును. మెదడుకు, కళ్లకు పుష్టిని కలిగించును. మందు గుణం ముందు ధర ఆలోచించదగినది కాదు. పూర్తి కోర్సుకు, పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు లేకుండా రు. 41/- మీ అడ్రసు ఇంగ్లీషులోనే వ్రాయండి.

**SUNITA AYURVED BHAVEN,**
LALBIGHA (GAYA) [A.D.]



**డా. కె.యల్. నారాయణ**



వైద్యవిద్వాన్, వైద్యాచార్య

చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, సుఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స.

పోస్టుద్వారా చికిత్స కలదు.

**లక్ష్మీ కుమారి క్లినిక్,**

మెయిన్ రోడ్, తెనాలి.


## రచయితలకు మనవి

**స్థానికంగా వున్న రచయితలు, కార్టూనిస్టులు కూడా మా కార్యాలయానికి వచ్చి వారి రచన లందజేస్తున్నప్పుడు వాటితోపాటు స్వంత చిరునామాగల స్టాంపులంటించిన కవరు పెట్టడం అవసరం. సం.**

### గమనిక

కలువబాల సంచికలకు ఢిల్లీ మొదలైన ప్రాంతములనుంచి
ప్రకటించే ఉచిత బహుమతి పోటీలు, గళ్ళు నుడికట్టు ప్రకటనలు మొదలైనవాటితో మాకు ఎలాంటి బాధ్యత వుండదు. పాఠకులతో అందు విషయమై ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. పాఠకులు వారి స్వంత బాధ్యతపైనే వారికి జవాబులు వ్రాసుకొనగలరు.

ఇట్లు
ఆంధ్రపత్రిక

## పేడియా మామయ్యా పొదుపు.....

భయంగా.

"ఏ కూరా కిలో నాలుగైదుకి తక్కువలేదు"

మాయ్య కొంచెం సర్దుకుని మళ్ళీ పుస్తకంలో తల దూర్చబోయాడు.

"ట్రింగ్.....టింగ్"

పేడియాగారు అదిరి పడ్డారు మళ్ళీ.

"కిరసనాయిలు మార్కెట్లో లేదు. బ్లాకులో కొంటే రెట్టింపు"

పేడియాగారు జుట్టు పీక్కుంటుంటే మళ్ళీ "ట్రింగ్.... టిణ్" అని ఏవిటని అడక్కుండానే చెప్పాడు మురళి.

"బొగ్గులు ఏడు రూపాయలు, ఉల్లిపాయలు మూడు రూపాయలు, కట్టెలు పది రూపాయలు పెరిగాయి"

ఇక మురళిని తప్పించుకోవడానికి నాన్న దగ్గరికి పరిగెట్టాడు మావయ్య.

దారుణంగావెరిగిపోతున్నాయిరాధరలు" అన్నారు నాన్న నిట్టూరుస్తూ.

"ఎందుకు పెరగవు? ఏదైనా వస్తువు కనిపిస్తే చాలు చేతిలో డబ్బుందికదా అని కొనెయ్యడానికి ఎగబడతారు. ఓ నెల పాటు దేశంలో అందరూ తిండి మానేస్తే ధరలు చచ్చినట్టు పడిపోతాయి. సింపుల్ లా అండ్ సప్లై అండ్ డిమాండ్.

"వీడికి అన్నీ తెలుసు కాని బుర్రే లేదే" నాన్న అమ్మతో అని మావయ్యకేసి తిరిగి, "ఒరే! నీ ప్లానులోంచి నన్ను కూడా తీసెయ్యరోయ్"

ఇంక సైకిలు కోసం ఎదురు చూస్తున్న నేనొక్కడినీ మిగిలాను కాబోలు, నా దగ్గర కొచ్చాడు పెద్ద మావయ్య.

"మరి ఈ రెండొందలు ఏం చేద్దాంరా?"

"అలా ఉంచు! మేమందరం రేపు గుండు గీయించుకుందుకు ఓ రెండొందలైనా ఉండద్దా" అన్నాను ఉడుకుమోత్తనంతో.

"ఏవిటా వేధవ మాటలు" అమ్మ మందలించింది.

"వాడు చెప్పేదీ నిజమేనే! ధరలు అలా మండిపోతున్నాయి" అన్నారు నాన్న.

ధరలు పెరిగాయి. ధరలు పెరిగాయి అని గోలే కాని మీ జీతాలు పెరగలేదూ" మావయ్య కోపంగా అన్నాడు.

"జీతాలు ఇంటి కప్పు దాకా ఎదుగుతే, ధరలు ఆకాశానికి ఎగురుతున్నాయి" అంది అమ్మ దిగులుగా.

"ఏవిటేవ్, విప్లవ కవిత్వం వినిపిస్తున్నావు సామాజిక స్పృహ ఎక్కువైందా?" మావయ్య వెటకారంగా అన్నాడు.

"సమాజంలో ఉండే ఎవడికైనా సామాజిక స్పృహ ఉంటుంది, నీలాటి ఉష్ట్ర పక్షులకి తప్ప." అంది అమ్మ మండిడుతూ.

"ఓం శాంతి, శాంతి, శాంతి" అన్నాను నేను అమ్మకి మాయ్యకి మధ్య నిలబడి.

* * *

ఇది జరిగి రెండు సంవత్సరాలైంది.

మేం సైకిలు కొనలేదు టి. వి. కొనలేదు. అద్దె తక్కువని కాలేజీకి ఇంకా దూరమైనా చాలా చిన్న ఇంట్లోకి మారాం.

నే నిప్పుడు కాలే జీలో చదువుతున్నాను. నాకు లోకం చాలామటుకు అర్థమవుతోంది.

'మగ వెధవలు, వీళ్ళ బట్టలు నేను కుట్టలేను' అని అమ్మ కుట్టుమిషను అమ్మేసింది కాని అది నిజం కాదని నాకు తెలుసు.

'మన దగ్గర దాచుకోడానికి ఏమున్నాయే' అని నాన్నగారు గాడ్రెజ్ బీరువా అమ్మేశారు కాని అదీ అబద్ధమని నాకు తెలుసు.

అమ్మ మెడలో ఇప్పుడున్న గొలుసు బంగారంది కాదని, అసలు గొలుసు మురళిని కాలేజీలో చేర్పినపుడు అమ్మేశారని నాకు తెలుసు.

నాన్న చొక్కాలు, మా లాగులు మార్చి కుట్టిన బట్టలు వేసుకుని చంటాడు బుడబుక్కలాడిలా ఇంట్లో తిరుగుతుంటే అమ్మ మా అందరితో పాటు విరగబడి నవ్వుతుంది కాని సగం నీళ్ళు, సగం నీళ్ళ పాలు కలిపి వాడి లెక్క ప్రకారం గ్లాసుడు పాలు మౌనంగా ఇస్తున్నప్పుడు ఆ మౌనం మాట్లాడే మాటల అర్థం కూడా నాకు తెలుసు.

చాలా మందితో పోల్చి చూసుకుంటే మా పరిస్థితి కొంచెం మెరుగే అయినా పైసపైస పొదుపు చేసి మేం దాస్తున్న సంచీకి అడుగు లేదని కూడా అర్థమయింది.

అదుపు లేకుండా ధరలు పెరుగుతుంటే అందరూ నష్టపోవడం లేదని కూడా కొత్తగా లేస్తున్న సినిమా సెట్టింగులలాంటి మేడలు చూస్తే తెలుస్తోంది.

కాని ఇంతవరకు స్పష్టంగా తెలియనిది ఒకటే.

దేశం అందరిదీ అయినప్పుడు కొందరు అగాధాల్లోకి ఎలా దిగజారిపోతున్నారో, కొందరు తారాజువ్వల్లా పైపైకి ఎలా ఎగరగలుగుతున్నారో నాకు అర్థం కావడంలేదు.

మీరు మా కంటే బాగా చదువుకున్నవారు, లోకం తెలిసిన మేధావులు కదా! మీకేమైనాతెలుస్తోందా?

మీకు తెలిస్తే నిజాయితీతో మాకు నిజం చెబుతారా? □

### గమనిక

**డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు ఆ శీర్షిక పేరు, ఆంధ్రసచిత్ర-వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520 003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పేరు, పూర్తి చిరునామా ఇవ్వడం ఎంతైనా అవసరం అని గమనించగోరుతున్నాము. సం.**